

ఘనంగా భగీరథ మహర్షి జయంతి

కామారెడ్డి టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి కలెక్టరేట్‌లో ఆదివారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. భగరథ మహర్షి గోపయోగి అని బహుజనుల కోసం యాగం చేసి ఎంతో కష్టపడి గంగను దీవి నుంచి భువికి తీసుకువచ్చాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ డివలప్‌మెంట్ అధికారి చక్రధర్, నాయకులు మల్లయ్య, హన్మండ్లు, మధు, నరేష్, హన్మండ్లు, నరేష్, పవన్, రాజేశ్వర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలోని గాంధీగంజ్‌లో అకాల వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఒక దగ్గరకు చేరుస్తున్న రైతులు

ఎండా.. వాన!

- జిల్లాలో పగలంతా దారెత్తిస్తున్న ఎండలు.. సాయంత్రానికి గాలివాన బీభత్సం
- అకాల, వడగండ్ల వర్షానికి తడిసిన ధాన్యం
- కామారెడ్డి, దోమకొండ, తాడ్వాయి, బీబీపేట మండలాల్లో వడగండ్ల వర్షాలు
- కొనుగోలు కేంద్రాల్లో 7 వేల క్వింటాళ్లకు పైగా ధాన్యం వర్షం పాలు
- మరికొన్ని చోట్ల వర్షం తాకిడికి కొట్టుకుపోయిన ధాన్యం
- తడిసిన ధాన్యం ఎవరు కొంటారోనని రైతుల ఆవేదన

కామారెడ్డి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓ వైపు ఎండలు ప్రజలను తారెత్తిస్తుండగా మరోవైపు అకాల, వడగండ్ల వర్షాలు అన్నదాతను ఆగమాగం చేస్తున్నాయి. పగలంతా 44 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవడంతో జిల్లావాసులు బయటకు రావాలంటేనే ఆందోళన చెందుతున్నారు. ఇక సాయంత్రం కాగానే అకాల వడగండ్ల వర్షాలు, గాలివాన బీభత్సంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆదివారం జిల్లా వ్యాప్తంగా అకాల, వడగండ్ల వర్షాలు రైతులను అతలాకుతులం చేశాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట సరిగా చేతికి వచ్చిన సమయంలో ధాన్యం నీటిపాలు కావడంతో రైతుల్లో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడుతోంది. ఈదురుగాలులకు అకాల వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతినడంతో రైతన్నలు నష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. సరిగా పంటలు కోతకు రావడం, ధాన్యం చేతికి అందడంతో కొనుగోలు కేంద్రాలకు తరలించగా ఆ ధాన్యాన్ని వర్షం ముంచెత్తుతోంది. అకాల, వడగండ్ల వర్షాల కారణంగా మార్కెట్ యార్డుల్లోని, కొనుగోలు కేంద్రాలలోని రైతన్నల ధాన్యం రాశులు నీటి పాలవుతుండడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వరద తాకిడికి కొట్టుకుపోయిన ధాన్యం రాశులు

కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గ పరిధిలో కురిసిన అకాల వర్షానికి వరి ధాన్యం వేల క్వింటాళ్లలోనే తడిసిముద్దయింది. రోడ్లపై, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని రైతులు ఆర బోశారు. అకాల వర్షాలు కురువడంతో వరదనీటికి మునిగిపోవడమే కాకుండా కొట్టుకుపోయింది. కామారెడ్డి, తాడ్వాయి, దోమకొండ, బీబీపేట, లింగంపేట, సదాశివనగర్, గాంధారి, ఎల్లారెడ్డి మండలాల్లో అకాల వర్షాలకు మార్కెట్ యార్డులలో, కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన ధాన్యం వర్షంపాలు కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కామారెడ్డి, రాజంపేట,దోమకొండ, బీబీపేట, నిజాంసాగర్, తాడ్వాయిలో, రామారెడ్డి, ఎల్లారెడ్డిలలో పెద్ద ఎత్తున వడగండ్ల వర్షం పడింది. మరోవైపు ఈదురుగాలులు నానా బీభత్సం సృష్టించాయి. ఇలా అకాల వర్షాలు, ఈదురుగాలులు రైతన్నలకు తీవ్ర నష్టాన్నే తెచ్చిపెట్టాయి.

7 వేల క్వింటాళ్లకు పైగా తడిసిన ధాన్యం

జిల్లాలో ప్రభుత్వం తరపున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 446 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యాన్ని సేకరిస్తున్నారు. ఈ కేంద్రాలకు రైతులు పెద్దఎత్తున ధాన్యాన్ని తరలిస్తున్నారు. ఆదివారం కురిసిన అకాల, వడగండ్ల వర్షాలతో కొనుగోలు కేంద్రాలలోని ధాన్యం భారీగా తడిసిపోయింది. కామారెడ్డి, దోమకొండ, మాచారెడ్డి, బీబీపేట, లింగంపేట, రాజంపేట తదితర మండలాల్లోని పలు కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షానికి రైతుల ధాన్యం తడిసిముద్దయింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం భారీగా వర్షం కురువడంతో గాంధీగంజ్, టెక్రియాల్, అడ్లూర్, పాత రాజంపేట, రామేశ్వర్‌పల్లిలో ధాన్యం ఆరబెట్టిన రైతులు ఇబ్బందులకు గురయ్యారు. కేంద్రాలలో కుప్పలు,కుప్పలుగా ధాన్యం రాశులను రైతులు పోసి ఆరబెట్టారు. ఒక్కసారిగా కురిసిన అకాల వర్షానికి ఈ ధాన్యం తడవడమే కాకుండా కుప్పల మధ్య భారీగా వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో ధాన్యం కుప్పలను ఎత్తి వర్షపు నీటిని తొలగించేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో అకాల వర్షానికి సుమారు 7 వేల క్వింటాళ్లకు పైగా ధాన్యం తడిసినట్లు రైతులు చెబుతున్నారు.

ధాన్యం ఆర బెట్టేందుకు రైతుల తిప్పలు

గత నెలరోజుల నుంచి జిల్లాలో యాసంగి పంటకు సంబంధించి కోతలు ప్రారంభమయ్యాయి. వరితో పాటు మొక్కజొన్న, జొన్న, శనగ తదితర పంటలను నూర్పిడి చేసి మార్కెట్‌కు రైతులు తరలిస్తున్నారు. జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలతో చేతికి వచ్చిన ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకునేందుకు రైతులు అపసోపాలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు భారీగా వరి ధాన్యంను రైతులు తరలిస్తున్నారు. తేమ శాతం లేకుండా రైతులు కేంద్రాల్లో, పంటపొలాల్లో, ప్రధాన రహదారుల పైన కుప్పలు తెప్పలుగా పోసి ఆర బెడుతున్నారు. ఇంతలోనే అకాల వర్షాలు కురుస్తుండడంతో ఆ పంట కాస్తా తడిసిముద్దవుతోంది. పదేపదే ధాన్యాన్ని ఆర బెట్టేందుకు రైతులు నానా తిప్పలు పడుతున్నారు.

అకాల వర్షాలతో కుదేలవుతున్న అన్నదాతలు

జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలకు అన్నదాతలు కుదేలవుతున్నారు. సరిగా పంట చేతికి వచ్చిన సమయంలో అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లోని సుమారు 7 వేల క్వింటాళ్ల వరకు ధాన్యం తడిసిపోగా వందల ఎకరాలలో వరి పంట, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. సరిగా చేతికివచ్చే సమయంలోనే అకాల వర్షాలు రైతుల పంటలను దెబ్బతిస్తుండడంతో మార్కెట్‌లో ఆ పంట ఉత్పత్తులను వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. కొనుగోలు చేసిన తక్కువ ధరకే తీసుకుంటుడడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





టెక్రియల్ కొనుగోలు కేంద్రం వద్ద అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఒక్క దగ్గరకు చేర్చుతున్న రైతులు

దారెత్తిస్తున్న ఎండలు

కామారెడ్డి జిల్లాలో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. గడిచిన 24 గంటల్లో పల్వంచ మండలం ఎల్పుగొండలో 44.7, రామారెడ్డిలో 44.7, మేనూరు 44.5, బిచ్కుంద 44.5, కొల్లూర్ 44.4, ఇసాయిపేట 44.3, బీర్కూర్ 44.1, సోమూర్ 43.7, డోంగ్లీ 43.5, లచ్చపేట 43.4, సదాశివనగర్ 43.3, గాంధారి 43.3, బొమ్మన్ దేవునిపల్లి 43.2, లింగంపేట 43.2, జుక్కల్ 43.1, నస్రూల్లాబాద్ 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



పాత రాజంపేట కొనుగోలు కేంద్రం వద్ద నిలిచిన వర్షం నీరు



భిక్కనూరులో ఈదురు గాలులు వీస్తున్న దృశ్యం



లింగంపేటలో వడగండ్ల వర్షం పడిన దృశ్యం



గొట్టిముక్కులలో కూలిన నిర్మాణంలో ఉన్న కోళ్లఫాం

8 నుంచి రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు

కామారెడ్డి టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 8 నుంచి జూన్ 12 వరకు రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తల కార్యక్రమం చేపడుతున్నట్లు డీఏవో తిరుమల ప్రసాద్ తెలిపారు. ఎంపిక చేయబడిన గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. రైతులకు యూరియా వాడకం, సాగు ఖర్చు తగ్గించడం, భూసారం కాపాడడం, విత్తన, పురుగు మందుల కొనుగోలు, రశీదులు భద్ర పరచడం, సాగునీటి ఆదా, పంట మార్పిడి పద్ధతులు, సుస్థిర ఆదాయం, చెట్ల పెంపకం, పర్యావరణ పరిరక్షణ తదితర విషయాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 8న తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్, 15న లింగంపేట మండలం మోతెలో, 22న కామారెడ్డి మండలం లింగాపూర్‌లో, 29న సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలో, జూన్ 5న నిజాంసాగర్ మండలం గోర్గల్‌లో, 12న నాగిరెడ్డిపేట, పోచారంలో సమావేశాలు ఉంటాయని తెలిపారు.

ఎల్లారెడ్డిలో ఎలుగుబంటి సంచారం



కళ్యాణి గ్రామస్థులకు కనిపించిన ఎలుగు బంటి

ఎల్లారెడ్డి రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలో ఎలుగుబండి సంచారం కలకలం రేపుతోంది. గత నాలుగు రోజులుగా వరుసగా తునికాకు సేకరణ కోసం వెళ్తున్న గ్రామస్థుల కంటపడుతుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. శనివారం కళ్యాణి గ్రామానికి చెందిన పలువురు ఎలుగుబంటిని చూసినట్లు తెలిపారు. కళ్యాణి, తిమ్మారెడ్డి గ్రామాల సరిహద్దు ప్రాంతాల్లో రామలింగం బావి అటవీ ప్రాంతంలో గల గుట్టపై ఉన్న మిషన్ భగీరథ ట్యాంక్ సమీపంలో గత శుక్రవారం కళ్యాణి గ్రామానికి చెందిన ముగ్గురు తునికాకు కోసం వెళ్లగా పుట్టమట్టిని తవ్వుతూ కనిపించిందని తెలిపారు. ఆదివారం సైతం కళ్యాణి గ్రామానికి చెందిన ఇనూస్, బాలేసాబ్‌లకు కనిపించడంతో తునికాకు సేకరణ నిలిపివేసి భయంతో అక్కడి నుంచి తిరిగి వచ్చారు. రామలింగం బావి సమీపంలో ఉన్న వాటర్‌ట్యాంక్ ఎల్లారెడ్డి, బాన్సువాడ ప్రధాన రహదారికి పక్కనే ఉండడం వల్ల రోడ్డుపై ఆ మార్గంలో వెళ్లే ద్విచక్ర వాహనదారులు సైతం జంకుతున్నారు. ఈ వేసవి కాలంలో అటవీ ప్రాంతంలో నీరు లేకపోవడంతోనే ఎలుగు బంటి మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ దగ్గరికి వస్తుందని తెలిపారు. అటవీశాఖాధికారులు జంతువుల కోసం తాగునీరు ఏర్పాటు చేయాలని అప్పుడు జంతువులు గ్రామ సమీపంలోకి రాకుండా ఉంటాయని కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు నిబంధనలు ఇవే..

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు దారిద్ర్య రేఖకు దిగువ కుటుంబానికి చెందిన వారై ఉండాలి. గ్రామాల్లో నివసించే లబ్ధిదారుడి ఆదాయం నెలకు పది వేల రూపాయలు, పట్టణ ప్రాంతాలకు 15 వేల లోపు ఉండాలి.
- రెండున్నర ఎకరాలకు ఎక్కువ భూమి కలిగిన రైతులు అనర్హులు
- నాలుగు చక్రాల వాహనం, ట్రాక్టర్ ఉన్న రైతులు అనర్హులు



వివరాలు 7లో..

రైతులకు గుర్తింపు



- ఆధార్ తరహాలో 11 అంకెల ప్రత్యేక గుర్తింపుకార్డు
- అందుబాటులోకి రానున్న ప్రత్యేక యాప్
- పీఎం కిసాన్ లబ్ధిదారుల రైతులకు తప్పనిసరి
- నేటి నుంచి గుర్తింపు కార్డు కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్
- రైతులు ఈనెల 31 వరకు నమోదు చేసుకోవాలి
- గ్రామాల్లో రైతువేదికల వద్ద వివరాల నమోదు
- జిల్లా వ్యాప్తంగా 4.18 లక్షల ఎకరాల్లో సాగు భూమి 3.25 లక్షల్లో రైతులు

కామారెడ్డి టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): రైతులకు సంబంధించిన పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపరచడం కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతీ రైతుకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చేలా ఆధార్‌కార్డు తరహాలో భూదార్ కార్డు జారీకి కేంద్రం శ్రీకారం చుట్టింది. 11 నెంబర్లతో కూడిన ప్రత్యేకంగా రూపొందించిన భూదార్‌కార్డు ఇవ్వనున్నారు. దీనికి సంబంధించి సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఇప్పటికే భూదార్ కార్డుల జారీకి అవసరమైన వివరాల సేకరణకు సంబంధించి వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏఈవోలకు తగు సూచనలు చేశారు. జిల్లాలో 4,18,190 ఎకరాల్లో సాగు భూములు ఉన్నాయి. 3,25,713 మంది రైతులు ఉన్నారు.

ఒకేచోట రైతుల సమగ్ర వివరాలు

రైతులకు సంబంధించిన సమగ్ర వివరాలు ఒకేచోట ఉండేలా నూతన విధానాన్ని కేంద్రం రూపొందించింది. దేశపౌరులకు ఆధార్‌కార్డు మాదిరిగా రైతులకు భూదార్ కార్డులతో గుర్తింపు ఇవ్వాలని ప్రణాళిక సిద్ధం చేసింది. రైతులకు సంబంధించి భూముల వివరాల కోసం 11 అంకెలతో కూడిన యూనిక్ కోడ్‌ను కేటాయించనున్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేసే క్రమంలో భాగంగా రాష్ట్రప్రభుత్వం సైతం ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయనుంది. ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. రైతులకు కేటాయించిన భూదార్ కార్డు నెంబర్ క్లిక్ చేస్తే రైతుపేరు, ఇతర వివరాలు ఇట్టే తెలిసిపోతాయి. సర్వే నెంబర్‌లు, రైతు స్వగ్రామం, భూమి ఏ ప్రాంతంలో ఎంత ఉంది. భూమి సారవంతమైనదైన ఆ భూమి ఏ పంటకు అనువైంది. దానిపై సదరు రైతుకు బ్యాంక్ రుణం ఎంత ఇవ్వచ్చో అనే వివరాలు తెలుస్తాయి. అంతేకాకుండా సబ్సిడీ వ్యవసాయ పరికరాలు, రసాయన ఎరువులతో పాటు పీఎం సమ్మాన్ నిధి పంట నష్ట వివరాలతో పాటు పూర్తి సమాచారం అందులోనే పొందుపరుచనున్నారు. ఇక నుంచి బ్యాంక్ రుణం కోసం పట్టాపాస్ పుస్తకం, ఇతర పత్రాలను రైతు అధికారులకు చూపించాల్సిన అవసరం ఉండదు. కేవలం రైతుకు కేటాయించిన పలు అంకెల నెంబర్లను సదరు అధికారికి చెబితే సరిపోతోంది.

ఈ - ఫార్మర్ రిజిస్ట్రి

వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతీ రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య చేయడం ద్వారా జాతీయ స్థాయిలో ఈ ఫార్మా రిజిస్టర్‌ను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో భూ యజమానులతో పాటు కౌలు రైతులకు సైతం వీటిని జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రైతులు భూదార్ కార్డు కోసం ఆయా గ్రామాల్లోని రైతువేదికల్లో నేటి నుంచి ఏఈవోలకు వివరాలు అందజేయాలని వ్యవసాయశాఖ ఆదేశించింది. ఇందులో భాగంగా వెబ్‌ల్యాండ్ డాటా ఆధారంగా జిల్లాలు, మండలాలు, గ్రామాల వారీగా రైతుల ఈ ఫార్మర్ రిజిస్ట్రిని రూపొందించనున్నారు.

నేటి నుంచి ఫార్మర్ రిజిస్ట్రి కార్యక్రమం

- తిరుమల ప్రసాద్, డీఏవో, కామారెడ్డి

జిల్లాలో సోమవారం నుంచి ఫార్మర్ రిజిస్ట్రి కార్యక్రమం చేపడుతున్నాం. ఈనెల 31 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. రైతులు ఆధార్, భూ యజమాన్య పాస్ పుస్తకం, ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ నెంబర్‌ను ఏఈవోలకు అందించాలి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 11 అంకెలతో కూడిన యూనిక్ కోడ్‌ను పొందాలి.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

నందిపేట, మే 04 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ పొన్న రాములు అనే వ్యక్తి ఇటీవల మృతి చెందారు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ఆయన భార్యకు రూ.40 వేల చెక్కును పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల మంజూరుకు కృషిచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, ఆర్మూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పొద్దుటూరి వినయ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జమిల్, చిన్నయ్య, ఎడ్డిగారి నిఖిల్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

శుక్రవారం దేవి విగ్రహ ప్రతిష్ఠాపన

ముప్కాల్, మే 04(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దూల గుట్ట వద్ద నూతనంగా నిర్మించిన శుక్రవారం దేవి మందిరంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

ఐలాపూర్‌లో ముగిసిన ఉత్సవాలు



నర్సింహ స్వామి విగ్రహం

నందిపేట. మే 04 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐలాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన నర్సింహా స్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు ముగిశాయి. ఇందులో భాగంగా ఆదివారం నర్సింహాస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన, సత్యనారాయణ వ్రతాలు, స్వామివారి కల్యాణం జరిపించారు. మూడురోజులుగా వేద పండితులు, బ్రాహ్మణుల మంత్రోత్సవాలతో భక్తి, శ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చివరి రోజులో భాగంగా భక్తులు పెద్ద మొత్తంలో తరలి వచ్చారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి

నవీపేట, మే4 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంటలకు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ కోరారు. ఆదివారం ఆయన నవీపేటలో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో లారీల కొరత ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే హమాలీల కొరత సమస్యను పరిష్కరించాలని, గోనె సంచుల కొరత లేకుండా చూడాలని ఆయన కోరారు. కొనుగోలు కేంద్రాలలో సేకరించిన ధాన్యానికి రైస్‌మిల్లులలో తరుగు చేపట్టకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవేందర్ సింగ్, కిషన్, గంగాధర్, సాయిలు, ఒడ్డెన్న, రాజన్న తదితరులున్నారు.

వేల్పూర్‌లో టిప్పు సుల్తాన్ వర్ధంతి



టిప్పుసుల్తాన్‌కు నివాళులు అర్పిస్తున్న ఏఐవైఎస్ సభ్యులు

వేల్పూర్, మే4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మజీద్‌వద్ద అంబేద్కర్ యువజన సంఘం, మైనార్టీల ఆధ్వర్యంలో ఆదివారం టిప్పు సుల్తాన్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎస్ వేల్పూర్ మండల అధ్యక్షుడు జే. ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి జాంబవ చామర్, యూత్ సభ్యులు, మైనార్టీలు తదితరులు పాల్గొన్నారు.

'రైతు ధర్నాను జయప్రదం చేయండి'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆర్మూర్ టౌన్, మే4 (ఆంధ్రజ్యోతి): మే 8 హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో జరిగే రైతు ధర్నాను జయప్రదం చేయాలని అఖిల భారత ఐక్యరైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.దేవారాం అన్నారు. ఆదివారం పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్ వద్ద రైతుధర్నా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మభ్యపెడుతూ కాలం వెళ్లదీస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను ఉప సంహరించుకుంటామని చెప్పి జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన చట్టం బిల్లు పేరుతో కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. వ్యవసాయ ఉత్పత్తులకు ఎంఎస్‌పీ కోసం చట్టపరమైన హామీ ఇవ్వాలని చిన్న, సన్నకారు మధ్యతరగతి రైతులకు పూర్తి రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలభారత రైతు సంఘం ఏరియా అధ్యక్షుడు గంగారాం, కార్యదర్శి యు.రాజన్న, నాయకులు సాయన్న, ఠాకుర్, అర్వింద్ , ఎండీ నజీర్ పాల్గొన్నారు.

మొరం టిప్పర్ పట్టివేత

నవీపేట,మే4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపూర్ శివారులో అక్రమంగా తరలిస్తున్న మొరం టిప్పర్‌ను శనివారం రాత్రి పట్టుకున్నామని ఎస్ఐ వినయ్ తెలిపారు. గ్రామానికి చెందిన చెరువులో అక్రమంగా మొరం తవ్వకాలు జరిపి తరలిస్తుండగా సంబంధిత టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. అక్రమంగా మొరం తరలిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలం

● సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

కోటగిరి,మే4(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నప్పటికీ ప్రచారం నిర్వహించుకోవడంలో పూర్తిగా విఫలమవుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం సీపీఐ నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ వర్గాలకు ఎన్నో హామీలు ఇచ్చిందన్నారు. దళితులను సీఎం చేయడంతో పాటు ఇంటింటికి ఉద్యోగం, అర్హులందరికీ తెల్లరేషన్ కార్డు, రుణమాఫీ వంటి అనేక హామీలు ఇచ్చి నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2 లక్షల రుణమాఫీతో పాటు బోనస్ ఇచ్చిందన్నారు. ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, ఎస్సీ వర్గీకరణ వంటి అనేక పనులు సీఎం రేవంత్ రెడ్డి చేపట్టినా వాటిని ప్రజలకు చేరువ చేయడంలో కాంగ్రెస్ నాయకులు విఫలమవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు మరింత వివరించే ప్రయత్నం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు విఠల్ గౌడ్, సునీల్, శివరాజ్, పండరి తదితరులు పాల్గొన్నారు.

యంచ విఠలేశ్వర స్వామి ఆలయంలో చోరీ



ధ్వంసమైన హుండీని పరిశీలిస్తున్న ఎస్ఐ వినయ్

నవీపేట,మే4(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ గుట్టపైన ఉన్న చారిత్రాత్మక విఠలేశ్వర ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ వినయ్, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తుతెలియని దొంగలు ఆలయంలోకి చేరుకుని హుండీతో పాటు బీరువాను ధ్వంసం చేశారు. బీరువాలో ఉన్న పలు వెండి వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. ఆలయానికి చెందిన హుండీని బయటకు తీసుకెళ్లి పగులగొట్టారు. హుండీలో ఉన్న సుమారు 4వేల రూపాయల నగదును చోరీ చేశారు. ఆదివారం సంఘటన స్థలాన్ని ఎస్ఐ వినయ్ పరిశీలించారు. క్లూస్‌టీమ్ సభ్యులు ఆలయానికి చేరుకుని పలు ఆధారాలను సేకరించారు. వీడీసీ అధ్యక్షులు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామంలో ఉన్న సీసీ కెమెరాలు గత సంవత్సరం క్రితం పాడైపోయాయని స్థానికులు పేర్కొన్నారు. పాడైపోయిన సీసీ కెమెరాలను వెంటనే మరమ్మతులు చేయించాలని వారు అధికారులను కోరారు.

'బోధన్‌లో మున్సిపాలిటీ కైవసం చేసుకుంటాం'



ఎంపీ అరవింద్‌తో గోపికిషన్

బోధన్‌రూరల్,మే4(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ బీజేపీ అధ్యక్షులుగా పసులోటి గోపి కిషన్ ఎంపీ ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి నియమించినట్లు గోపి కిషన్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పట్టణ అధ్యక్షుడిగా బాధ్యతలు ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బోధన్‌లో బీజేపీ మున్సిపాలిటీ చైర్మన్ సీటును కైవసం చేసుకుంటుందని, వచ్చే సంస్థగత ఎన్నికలు, మున్సిపాలిటీ ఎన్నికలలో అహర్నిశలు శ్రమించి పార్టీలో అందరిని కలుపుకుని పార్టీ గెలుపునకు కృషి చేస్తానన్నారు. చైర్మన్ సీటును కైవసం చేసుకుంటామని దీమా వ్యక్తం చేశారు.

బీజేపీ బాల్కొండ మండల అధ్యక్షుడిగా నవీన్

బాల్కొండ : బాల్కొండ మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా అంబటి నవీన్ ఆదివారం నియమితులయ్యారు. ఈయన అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఇది రెండవసారి. తనపై నమ్మకంతో రెండోసారి మండల బీజేపీ అధ్యక్షుడిగా నియమించిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని నవీన్ తెలిపారు.

'బీజేపీ పటిష్టతకు సమిష్టిగా కృషిచేయాలి'

మెండోర : బీజేపీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కలిసి కట్టుగా కృషి చేయాలని బీజేపీ నూతన మండల అధ్యక్షుడు మార ముత్యంరెడ్డి అన్నారు. ఆదివారం మెండోర మండల బీజేపీ అధ్యక్షుడిగా మార ముత్యం రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పార్టీ గ్రామస్థాయిలో అభివృద్ధి పథంలో నడిపించడానికి అందరూ ఐక్యమత్యంతో ముందుకు సాగాలని సూచించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సరిన్

నవీపేట : భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా సరిన్ శనివారం నియామకం అయ్యారు. నవీపేట బీజేపీ మండల అధ్యక్షుడిగా రెండోసారి తనను నియమించడం పట్ల సరిన్ హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి కృషి చేసిన నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీ.మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడిగా రెండవ సారి నియామకమైన సరిన్‌ను ఆదివారం పలువురు మండల బీజేపీ నాయకులు కలిసి అభినందించారు.

బీజేపీ వేల్పూర్ మండల అధ్యక్షుడిగా బేల్దార్ నవీన్

వేల్పూర్ : వేల్పూర్ మండల బీజేపీ అధ్యక్షుడిగా రామన్నపేట్ గ్రామానికి చెందిన బేల్దార్ నవీన్ ఆదివారం నియమించారు. తన నియమకానికి సహకరించిన ఎంపీ అర్వింద్ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి, మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాల్కొండ ఇంచార్జి ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, కన్వీనర్ మల్కన్నగారి మోహన్, జిల్లా సెక్రటరీ నర్సింహారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రమేష్‌రెడ్డిలకు నవీన్ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికలలో తమ పార్టీ అభ్యర్థుల గెలుపుకు పాల్పడుతానని నవీన్ ఈ సందర్భంగా అన్నారు.

'అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా'



సునీల్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేస్తున్న సభ్యులు

మెండోర, మే 4(ఆంధ్రజ్యోతి): బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఇండ్లు లేని పరిస్థితి ఏర్పడిందని బంగారు తెలంగాణ అని చెప్పుకునే బీఆర్ఎస్ పాలనలో పేదలు ఇబ్బంది పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వేల్పూర్, కమ్మ ర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు కొత్తింటి ముత్యంరెడ్డి, నర్సయ్య, బద్దం అశోక్, మౌలానా పాల్గొన్నారు.

వేల్పూర్ : మండలంలోని పడిగెల గ్రామంలో పలు అభివృద్ధి పనులు మంజూరు కోసం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సునీల్‌కుమార్‌ను ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. పడిగెల గ్రామం నుంచి శ్రీరాంపూర్ గ్రామం వెళ్లే రోడ్డుకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని, అదిమల్లన్న గుడిచుట్టు రథం తిరగడానికి అనువుగా ఉండేందుకు సీసీ రోడ్డును, మేడిఒర్రె పై చిన్న బ్రిడ్జి నిర్మాణం, రాంమందిర్ వద్ద మంచినీటి ట్యాంక్‌ను, కొచ్చెరువు తూము మరమ్మతులు వంటి పనులకు నిధులు మంజూరు చేయాలని వీడీసీ సభ్యులు సునీల్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు పాక్వట్ల గంగారెడ్డి, జక్కుల రాజేశ్వర్, చెండిరాములున్నారు.

బాల్కొండ : బాల్కొండ మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం బాధి త కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. బాల్కొండలో ఇటీవల ఎండీ కలిమోద్దీన్ గుండెపోటుతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కిసాన్‌నగర్ గ్రామానికి చెందిన గుర్రపు చిన్నయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, అదే గ్రామానికి చెందిన షేక్‌మోహిత్‌పాషా తల్లి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. అనంతరం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జక్కు గంగారాం అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్యం, క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం



ఐలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సన్మానం



ఫకీరాబాద్‌లో ...

నందిపేట, మే 04 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐలాపూర్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి పరీక్షలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను ఆదివారం పీఏ సీఎస్ చైర్మన్ సిద్దాపురం మీసాల సుదర్శన్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. పదోతరగతిలోని 44 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. బి.లాస్య అనే విద్యార్థిని 566 మార్కులు సాధించి మండల స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. అలాగే సదియ బేగం అనే విద్యార్థిని 561 మార్కులు సాధించి పాఠశాలలో రెండోస్థానంలో నిలిచింది. 500 పైగా మార్కులు సాధించిన 24 మంది విద్యార్థులను సన్మానించారు. పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు పీఏసీఎస్ చైర్మెన్ సుదర్శన్ నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.లాలయ్య, ఉపాధ్యాయులు ఎస్.సదానందం, ఎల్ సత్యనారాయణ, గంగుల మురళి, ఎస్ సాయన్న, ఆర్.సతీష్, వీడీసీ సభ్యులు ఉన్నారు.

నవీపేట : మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో ఆదివారం ఇటీవల విడుదల అయిన టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. స్థానిక యూపీఎస్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన సంబంధిత విద్యార్థులకు శాలువా మెమెంటోలతో నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో సందీప్, శ్రీధర్ బాబు, హరీష్ కుమార్, సతీష్, గంగాధర్, యోగేష్, బాలరాజు, కృష్ణ, నర్సింలు తదితరులున్నారు.

నేటి నుంచి ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

నవీపేట,మే4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం నుంచి జూన్ 5వ తేదీ వరకు గ్రామాల్లో ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టామని ఏవో నవీన్ కుమార్ తెలిపారు. ఆధార్‌తో ప్రతి పౌరుడికి గుర్తింపు ఇచ్చిన విధంగానే కేంద్ర ప్రభుత్వం ప్రతి రైతుకు 11నెంబర్ల కూడిన విశిష్ట సంఖ్య(యూని కోడ్) కేటాయించాలని నిర్ణయించిందన్నారు. దీనికి అనుగుణంగా ప్రతి రైతు తన భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారంతో ఫార్మర్స్ రిజిస్ట్రేషన్‌లో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. సంబంధిత రైతులు ఏఈవోలకు కలిసి తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో పాటు ఆధార్‌కు లింక్ చేయబడిన ఫోన్ నెంబర్‌ను తమవెంట తీసుకెళ్లాలని నమోదు చేసుకోవాలన్నారు.

గోడప్రతుల ఆవిష్కరణ



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న రైతుసంఘం నాయకులు

కమ్మర్‌పల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8 న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో అఖిలభారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్)అద్వర్యంలో నిర్వహింపతలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు సారా సురేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం కమ్మర్‌పల్లి మండల కమిటీ నాయకత్వంలో గోడప్రతులను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతు రైతులను రాజులుగా చేస్తామన్న బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చి రైతుల నడ్డివిరుస్తున్నారన్నారు. రైతులకు చేసిన మేలు ఏది లేదన్నారు. కేంద్రప్రభుత్వం తెచ్చిన మూడు నల్లచట్టాను ఉపసంహరించుకోవాలని, జాతీయవ్యవసాయ మార్కెటింగ్ విదాన చట్టం బిల్లు పేరు తో మళ్లీ కార్పొరెట్ సంస్థలకు లాభాలు చేకూరేలా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మూడు నల్లచట్టాలను రద్దుచేస్తు స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు పరుస్తు ఎంఎస్పీచట్టాన్ని అమలు పర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అంబం(వై) గ్రామంలో క్రికెట్ టోర్నీ



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న దృశ్యం

ఎడపల్లి, మే4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబం గ్రామ యువకులు తమ తోటి మిత్రుడు బోయిడి సందీప్ జ్ఞాపకార్థం స్మారక క్రికెట్ పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీలను మాజీ ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన బోయిడి సందీప్ అనే యువకుడు గత నెల ఏప్రిల్ 28వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమని, ప్రతి ఒక్కరు వాహనం నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుని హెల్మెట్ ధరించి, మత్తు పానీయాలు సేవించకుండా వాహనం నడపాలన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ర్పంచ్ పిస్క గంగా ప్రసాద్, సాయి చరణ్, అశోక్, ప్రశాంత్, చందు, గోపి, ప్రవీణ్ గ్రామ యువకులు, వివిధ గ్రామాల క్రికెట్ జట్ల సభ్యులు తదితరులు ఉన్నారు.

రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు



ఎత్తొండ క్యాంప్‌లో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కోటగిరి,మే4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తొండ క్యాంప్‌లో హైదరాబాద్ రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్ రావు ప్రారంభించారు. క్యాంప్‌లో ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ మఠం ట్రస్ట్ ఆర్గనైజర్ శివ శ్రీనివాస్, హన్మంత్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అరుణ్ కుమార్, సూర్యనారాయణ, మదన్ కృష్ణ, సంజీవ్, భాస్కర్, తుకారాం, మొగులప్ప, మాణిక్, మారుతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె సక్సెస్ చేద్దాం



జెండాను ఎగురవేస్తున్న దృశ్యం

వర్ని,మే4(ఆంధ్రజ్యోతి): మేడే స్ఫూర్తితో ఈ నెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను సక్సెస్ చేయాలని సీపీఎం నాయకులు ఎర్ర గాయత్రి పిలుపునిచ్చారు. మేడే వారోత్సవాల్లో భాగంగా ఆదివారం వర్ని మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎర్ర గాయత్రి మాట్లాడుతూ ప్రపంచంలో ఎర్రజెండా ఎల్లప్పుడు కష్టజీవుల కోసం పోరాడుతుందని, కుల, మత భేదాలు లేకుండా సమసమాజ నిర్మాణం కోసం ఉద్యమిస్తుందన్నారు. ఎర్రజెండా చూపిన బాటలో పార్టీ కార్యకర్తలు, కార్మికులు, కర్షకులు, పేద ప్రజలు సమసమాజన నిర్మాణం కోసం ఉద్యమించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబు, సురేష్, సాయిలు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళం

నందిపేట, మే 04 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాంనగర్‌లో నిర్మిస్తున్న రామాలయానికి ఆదివారం రూ.లక్షా యాబై వేలు విరాళం అందజేశారు. ఆకుపత్రి గంగాధర్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు కార్తీక్, తరుణ్‌లు రూ.లక్షా యాబై వేలు నగదును ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించినందుకు ఆలయ కమిటీ సభ్యులు దాతలను శాలువాతో సత్కరించారు. ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలకు కుటుంబ సభ్యులతో హజరు కావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మంద నడ్పి సాయన్న, ఏలిగేటి రాజు, బుక నారాయణ, డీలర్ సీతారాం, గంగాధర్, మేర నర్సయ్య, ఆకుపత్రి రాంబాబు తదితరులు ఉన్నారు.

ఆలయానికి రూ.లక్షా 75 వేల విరాళం

ముప్కాల్, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా నిర్మిస్తున్న శుక్రవారం దేవీ ఆలయానికి రూ.లక్షా75వేలు సావెల్ గ్రామానికి చెందిన గుండు మనోహర్ ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గుండు మనోహర్ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.


మహాలక్ష్మీ ఆలయ ఆవరణలో శ్రమదానం



ఆలయంలో శ్రమదానం చేస్తున్న సభ్యులు

ఆర్మూర్ రూరల్, మే4(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని మహాలక్ష్మీ ఆలయంలో ఆదివారం స్వచ్ఛ ఆర్మూర్ కార్యక్రమంలో భాగంగా మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. సంస్థ సభ్యులు మహాలక్ష్మీ ఆలయ ఆవరణ పరిసర ప్రాంతాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించి ఆలయం చుట్టు ఉన్న చెత్తచెదారాన్ని తీసివేసి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మహాత్మస్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, సభ్యులు ప్రశాంత్, సుంకె నిశాంత్, సాయికిరణ్, రాజ్‌కుమార్, సతీష్, బోజన్న, గంగారెడ్డి, కృషివర్ధన్, పెద్ద గంగారాం తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వవిద్యార్థులు

ఆర్మూర్ రూరల్, మే4(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఉన్నత పాఠశాల 2002- 03 సంవత్సరపు పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జీఆర్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతంలో ఉన్న పూర్వ విద్యార్థులు ఒక్కచోట సమావేశమై ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులు శంకర్, సురేందర్, వేణుగోపాల చారి, ఓబన్న, నరేందర్, రఘునాథ్, దయాకర్‌లను ఘనంగా సన్మానించారు.



రహదారిపై కనువిందు చేస్తున్న పూల చెట్లు

రంగులమయం.. రహదారి ప్రయాణం

పెద్దకొడప్‌గల్, మే 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో ఉపాధి హామీ పథకం కింద రహదారులకిరుపక్కల మొక్కలను నాటారు. అవి ప్రస్తుతం పెద్దగా పెరిగి పూల చెట్లుగా మారాయి. మండల కేం ద్రంతో పాటు గ్రామాలకు వెల్లే రహదారులకు ఇరుపక్కల గతంలో గుల్ మొహర్, కానుగ, వేప, చైనా బాదాం లాంటి మొక్కలను నాటారు. ఇం దులో గుల్‌మొహర్ చెట్లు ప్రస్తుతం ఎర్రనిపూలు పూలు రహదారి వెంట ప్రయాణం చేసే వారికి ఆహ్లాదం పంచుతున్నాయి. రహదారికి ఇరువైపు గుల్‌మొహర్ చెట్లు ఎర్రని పూలు పూసి అందంగా కనబడుతున్నాయి. దీంతో రహదారి వెంట ప్రయాణం సాగించేవారు పూల అందాలను చూ స్తూ వీక్షిస్తూ ప్రయాణం చేస్తున్నారు. గతంలో అడవులు, కొండలలో కన పడే తురాయి చెట్లు నేడు రహదారి పక్కన పూలతో అందంగా దర్శన మివ్వడంతో ప్రయాణికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. దీంతో పాటుగానే రహదారుల వెంట నాటిన కానుగ చెట్లు కూడ కొత్తఆకులతో నిండుగా మారి రహదారి వెంట వెళ్లేవారు నీడకోసం కానుగ చెట్లను ఆశ్రయి స్తున్నారు.

మట్టికుండ నీళ్లు ఆరోగ్యానికి మేలు

● ఎన్ని ఫ్రిజ్‌లు వచ్చినా మట్టి కుండకు తగ్గని డిమాండ్

● ఊపందుకున్న విక్రయాలు



అమ్మకానికి సిద్దంగా ఉంచిన మట్టికుండలు

భీమ్‌గల్ రూరల్,మే 4 (ఆంధ్రజ్యోతి): ఎండాకాలం వచ్చిందంటే ప్రతి ఇంట్లో మట్టికుండ ఉండాల్సిందే. ఈ మట్టికుండకు సహజ సిద్ధంగా నీటిని చల్లబరిచే గుణం ఉంటుంది. అందుకే మట్టికుండలోని నీళ్ల త్రాగడం ద్వారా శరీరానికి ఎంతో మేలు జరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు. అందుకే మార్కెట్‌లోకి ఎన్నో రకాల అదునాథతన ఫ్రిజ్‌లు వచ్చిన మట్టి కుండకు మాత్రం డిమాండ్ తగ్గడం లేదు. అందుకే ఈ మట్టికుండను పేదోడి ఫ్రిజ్‌గా చెప్పుకుంటారు. మట్టికుండలో ఉన్న అతిసూక్ష్మ రంధ్రాల ద్వారా గాలి కుండలోకి దూరి నీరు సహజ సిద్ధంగా, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటిని చల్లబరుస్తుంది. అంతేకాకుండా అందులోని నీరు సహజ సిద్ధంగా వందశాతం నీరు ప్యూరీఫైగా మారుతుంది. అందుకే ఆ నీరు ఆరోగ్యంతో పాటు వేసవిలో దాహార్తిని తీరు స్తుంది. అలాగే కుండలోని నీరు తాగడం వల్ల మినరల్స్ ఎలాక్ట్రొలైట్స్ కోల్పోకుండా మట్టికుండ కాపాడుతుంది. స్వచ్ఛమైన నీరు శరీరానికి అందడం కారణంగా ఇమ్యునిటీ పెరిగి శరీరం డీహైడ్రేడ్ కాకుండా శక్తిని అందించి వడదెబ్బ తగలకుండా కాపాడుతుంది. అందుకే మట్టి కుండను ఆధునిక యుగంలో అమృతదారగా పిలుచుకుంటారు. వ్యాపారులు వినియోగదారులను ఆకర్షించేందుకు అందంగా తీర్చిదిద్దిన మట్టి కుండలు, రంజన్లను రాజస్థాన్ రాష్ట్రం నుంచి దిగుమతి చేసుకుని విక్రయాలు జరుపుతున్నారు. మట్టి కుండకు రంజన్లకు నల్లాలు బిగించి సైజ్‌ను బట్టి 300 నుంచి 600 రూపాయలకు అమ్ముతున్నారు.

చెత్త సేకరణకు సరిపోని వాహనాలు

● 36 వార్డులకు 22 వాహనాలు అందుబాటులో ● 12 కాలం చెల్లిన వాహనాలతో అష్టకష్టాలు



ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం



మున్సిపల్‌లో చెడిపోయిన రెండు వాహనాలు



వాహనాన్ని రిపేర్ చేసుకుంటున్న డ్రైవర్

ఆర్మూర్ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 36 వార్డులకు గాను చెత్తసేకరణ వాహనాలు 22 ఉండటంతో చెత్త సేకరణకు వాహనాలు సరిపోవడం లేదు. దీంతో పలు కాలనీల్లో, ఇళ్ల వద్ద చెత్త నిలిచి పోయి ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. మున్సిపల్ పరిధిలో పట్టణంతో పాటు మామిడిపల్లి, పెర్కిట్, కొటార్మూర్ గ్రామాలు ఉండగా చెత్త సేకరణ కొరకు మున్సిపాలిటికి చెందిన 22 వాహనాలలో 12 ప్యాజో కంపెనీకి చెందిన కాలంచెల్లిన వాహనాలను 2021-22 ఆర్థిక సంవత్సరంలో గత పాలకవర్గం కొనుగోలు చేసింది. కాలం చెల్లిన వాహనాలు కొనుగోలు చేయడంతో మోటర్ వేహికల్ ఇన్‌స్పెక్టర్ వాటికి రిజిస్ట్రేషన్ చేయడానికి నిరాకరించినట్లు తెలిసింది. ఇప్పటి వరకు కూడా ఆ వాహనాలకు రిజిస్ట్రేషన్‌లు చేయించకపోవడం విడ్డురం. దీనికి తోడు ప్రతిసారి ఏదోఒక సమస్యతో 12 వాహనాలు ఏదో ఒక సమస్యతో ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. నిలిచిపోయిన వాహనాన్ని స్టార్ట్ చేయాలంటే ఇంకో వాహనంతో వెనుక నుండి తోయాల్సిందే. చెత్త సేకరణకు వెళ్ళిన వాహనం ఎదోఒక చోట భారీ చెత్తను తీసుకోవాలంటే వాహనాన్ని బంద్ చేయకుండా ఉంచాల్సి వస్తుంది.. దీంతో డీజిల్ అదనంగా ఖర్చు అయి మున్సిపల్‌లో ఖర్చు పెరుగుతుంది. ఈ వాహనాల రిపేర్‌లకు లక్షల కొద్ది ఖర్చు చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఇటీవల ఒక వాహనాన్ని జిల్లా కేంద్రంలో మరమ్మత్తులు చేసి తీసుకవస్తుండగా మధ్యలో నిలిచిపోయిం ది. దీంతో అష్టకష్టాలుపడి మళ్లీ జిల్లా కేంద్రానికి మరమ్మతుల కోసం జిల్లా కేంద్రానికి పంపించారు. కాలం చెల్లిన రెండు వాహనాలు పూర్తిగా చెడిపోవడంతో సుమారు మూడు సంవత్సరాలుగా మున్సిపాల్ కార్యాలయంలో ఒక పక్క ఉంచారు. మిగతా వాహనాలు చెడిపోతే ఆరెండు వాహనాల నుంచి అవసరమైన వస్తువులను తొలగించి వేరేవాటికి బిగిస్తున్నారు. ఇదిలా ఉండగా మున్సిపాల్టీలో 36 వార్డులుండగా చెత్త సేకరించి ఊరు చివరన గల డంపింగ్ యార్డ్‌కు తరలించి మళ్ళీ చెత్తను సేకరించి తరలించడానికి సమయం వృదా అవుతుంది. ఆలూర్ రోడ్డులో సేకరించిన చెత్త పెర్కిట్ శివారులోని బైపాస్‌లో రోడ్డు పక్కన గల డంపింగ్ యార్డుకు తరలించి రావడంతో డీజిల్ , సమయం వృదా అవుతుంది. రెడ్డి చెరువు వద్దగల డంపింగ్ యార్డును మున్సిపల్ అధికారులు వినియోగించడం లేదు.

వాహనాల కొనుగోలుపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి

మున్సిపల్ పరిధిలో చెత్త సేకరణ కొరకు 2021-22 ఆర్థిక సంవత్సరంలో 12 వాహనాల కొనుగోలుపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు. ఆ ఆర్థిక సంవత్సరంలో బీఎస్6 వాహనాలను కొనుగోలు చేయాల్సి ఉండగా కాలంచెల్లిన బీఎస్4 వాహనాలను కొనుగోలు చేశారు. ఇంజనీరింగ్ శాఖ ద్వారా మున్సిపల్‌కు అవసరమయ్యే వాహనాలను కొనుగోలు చేస్తారు. తక్కువ ధరకు 12 వాహనాలను కొనుగోలు చేసి ఎక్కువ ధరను చెల్లించినట్లు నాయకులు, ప్రజలు గుసగుసలాడుతున్నారు. అమ్యామ్యా లకు ఆశపడి కాలంచెల్లిన వాహనాలు కొనుగోలు చేయడంతో ప్రతీయేట మున్సిపల్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇంజనీరింగ్ అధికారులు సక్రమైన వాహనాలు కొనుగోలు చేసి ఉంటే ఇప్పుడు నష్టం జరుగకుండా ఉండేదని ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అధికారులపై చర్యలు చేపట్టాలని ప్రజలు ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.



మరో వాహనం సహయంతో ట్రాలి వాహనాన్ని స్టార్ట్ చేస్తున్న దృశ్యం

కన్నుల పండువగా

శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వర స్వామి కల్యాణం



ధర్మారం వెంకటేశ్వర ఆలయంలో శ్రీదేవి భూదేవి వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న బ్రాహ్మణులు

డిచ్‌పల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): ధర్మారం(బి) గ్రామంలోని వేంకటేశ్వర ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పుర స్కరించుకొని ఆదివారం వేద బ్రాహ్మణులు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర కల్యాణోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఆల య ప్రధాన అర్చకులు రాహుల్ త్రిపాఠి, బ్రహ్మశ్రీ వేలేటి పశుపతి శర్మ, బ్రహ్మశ్రీ ఉమా మహేశ్వరస్వామి, ప్రధాన అర్చకులు కల్యాణోత్స వాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రావుల బ్రహ్మానందం, ఆలయ ప్రతినిధులు నాయుడు ఆంజనేయులు, నాగార్జున, శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నత్తనడకన కొనసాగుతున్న మాధవనగర్ ఆర్వోబీ పనులు

మాధవనగర్ ఆర్వోబీ పనులు

గడువులోగా పూర్తయ్యేనా..!?

● గడువు పూర్తి కావస్తున్నా పూర్తిగాని మాధవనగర్ ఆర్వోబీ పనులు ● ఇప్పటికే రెండుసార్లు గడువు పెంచిన అధికారులు

● మే నెల చివరి వరకు నిర్మాణం కష్టమే ● మరోసారి గడువు పెంపునకు ప్రయత్నాలు

డిచ్‌పల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మాధవనగర్ ఆర్వోబీ పనులు ప్రారంభ దశలో వేగంగా సాగినా గత రెండేళ్లుగా రెండు అడుగులు ముందుకు నాలుగు అడుగులు వెనక్కు అనే చందంగా పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. నిబంధనల మేరకు మే నెలాఖరు వరకు నిర్మాణ పనులు పూర్తి కావల్సిన ఉండగా ఆ దిశగా పనులు పూర్తయ్యేలా కనబడటం లేదు. 75శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇప్పటికే రెండు సార్లు గడువు పొడిగించారు. కాంట్రాక్టర్‌కు సరైన సమయంలో నిధులు ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. 4లైన్ల వంతెన నిర్మాణంలో ఒకవైపు రెండు వరుసలు పూర్తయ్యాయి. మరో వైపు ఇంక పిల్లర్ల దశలోనే కొనసాగుతున్నాయి. రైల్వే పట్టాలపై స్టీల్ బిడ్డర్‌లను నిర్మించాల్సి ఉంటుంది. పనుల జాప్యంతో వంతెన నిర్మాణ పనులు ఇంకా ఎప్పుడు పూర్తి అవుతాయోనని రాబోయేది వర్షాకాలం కావున పనులకు ఇబ్బందులు ఎదురవుతాయని వాహనదారులు సైతం జిల్లా కేంద్రానికి రాకపోకాలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ తిరిగి కంఠేశ్వర్ మీదుగా బస్సులు, హెవీ వెహికల్స్ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. కావున ఆర్‌అండ్‌బీ, రైల్వే అధికారులు పనులను జాప్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కొంత వరకు వేసిన స్టీల్ వంతెన



అసంపూర్తిగా వంతెన పనులు

ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు నిబంధనలు ఇవీ..

మద్నూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను దారిద్ర రేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను రూపొందించింది. పక్కాగా పేదలకు ఇల్లు దక్కేలా పకడ్బందీగా సర్వే చేస్తుండగా, నిబంధనలు కఠినతరంగా ఉండటంతో అనేక మందికి ఇల్లు దక్కే అవకాశం లేదు. కారు, ఏసీ, ట్రాక్టర్‌తో పాటు చాలా నిబంధనలు రూపొందించగా, వడపోతలు లబ్ధిదారులు ఇళ్లకు అర్హత కోల్పోతున్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారుల సర్వేకు ప్రత్యేక అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను అందించింది. జుక్కల్ నియోజకవర్గంలోని 8 మండలాలకు గాను 3401 ఇళ్లను మంజూరు చేసినట్లు జాబితా విడుదల చేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు కింది నిబంధనలు పాటించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



నమూనా ఇందిరమ్మ ఇల్లు

● ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బీపీఎల్ (దారిద్ర్య రేఖకు దిగువ) కుటుంబానికి చెందిన వారై ఉండాలి. గ్రామాల్లో నివసించే లబ్ధిదారుడి ఆదాయం నెలకు రూ.10 వేలు, పట్టణ ప్రాంతాలకు రూ.15 వేల లోపు ఉండాలి.

● రెండున్నర ఎకరాలకు ఎక్కువ భూమి ఉన్న రైతులు అనర్హులు.

● నాలుగు చక్రాల వాహనం, ట్రాక్టర్ ఉన్న రైతులు అనర్హులు.

● లబ్ధిదారుడి కుటుంబంలో క్రాప్ లోన్ 50 వేల రూపాయలకు మించి ఉండరాదు. ● లబ్ధిదారుడి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే అర్హులు కారు. ● దరఖాస్తు చేసుకున్న ప్రాంత వాసి అయి ఉండాలి. ● సంచార కుటుంబాలకు ఇల్లు మంజూరు చేయరాదు. ప్రస్తుతం రేకుల షెడ్డు, కూనే పెంకుల ఇంటిలో ని వాసం ఉన్న లబ్ధిదారుడు అర్హుడు. ● తండ్రి, ఇద్దరు కుమారులతో నివాసం ఉన్నట్ల యితే ఒక్కరికే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తారు. ● మున్సిపల్ ప్రాంతంలో అద్దె ఇంటిలో నివాసం ఉండే లబ్ధిదారులు అర్హులే. ● పట్టణ ప్రాంతాల్లో ఇంటి స్థలం పట్టా సర్టిఫికెట్ ఉండాలి. ● లబ్ధిదారుడికి 60 గజాల ఇంటి స్థలం ఉండాలి.

● ఇంటి స్థలానికి సంబంధించి పట్టా, ఓనర్ షిప్ సర్టిఫికెట్ లేకుంటే ఇల్లు మంజూరు చేయరాదు. ● కొత్త ఇంటి నిర్మాణం 400 నుంచి 600 అడుగుల లోపు ఉండాలి. అధికంగా ఉంటే అనుమతి ఇవ్వరాదు.

● ఇండ్ల నిర్మాణంలో రెండు గదులు, కిచెన్, మరుగుదొడ్డితో నిర్మించాలి.

● ఇంటి నిర్మాణం ఇంతకు ముందే ప్రారంభించిన, పాత ఇంటిని కలుపుకుని నిర్మించిన కొత్త ఇందిరమ్మ ఇంటికి అనర్హులే.

● ప్రభుత్వం జారీ చేసిన పై నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కానున్నాయి. ● అనర్హుల తొలగింపు

ఉమ్మడి మద్నూర్ మండలంలో ప్రభుత్వ నిబంధనల మేరకే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ది చేకూరుతుందని ఎంపీడీవో రాణి అన్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో 560 ఇండ్లు మంజూరు కాగా వాటిలోంచి 124 లబ్దిదారులు అనర్హులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు.

● రాణి, ఎంపీడీవో

భళా.. ఆరోగ్య మహిళ

● మహిళలకు ప్రయోజనకరంగా మారిన కార్యక్రమం ● పలు రకాల వ్యాధులకు ఉచిత పరీక్షలు, చికిత్స

● క్షేత్రస్థాయిలో ప్రచారం చేపడితే మరిన్ని ఫలితాలు

బోధన్‌రూరల్,మే4(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సమస్యలు పరిష్కరించి వారికి తగిన సలహాలు, సూచనలు అందించేందుకు వీలుగా గత యేడాది మార్చి 8 మహిళా దినోత్సవం రోజున ప్రభుత్వం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభించింది. జిల్లా, బోధన్ డివిజన్ పరిధిలోని 12ప్రాథమిక కేంద్రాలను ఎంపిక చేసి అక్కడ ప్రత్యేకంగా మహిళ క్లినిక్‌లు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రతీ మంగళవారం ఇక్కడ మహిళలు తమ ఆరోగ్య స్థితిగతులను పరీక్షించుకోవచ్చు. యేడాది క్రితం ప్రారంభమైన ఈ కార్యక్రమం మంచి సత్ఫలితాలను ఇస్తుంది. జిల్లా, బోధన్ డివిజన్ మహిళ ఆరోగ్య చికిత్స పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచింది డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ సమత తెలిపారు. మహిళల్లో అనేక రకాలైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి అందుబాటులోకి తీసుకువచ్చింది ఈ పథకం.



పరీక్షల కోసం బారులు తీరిన మహిళలు

● అనేక రకాల పరీక్షలు

మహిళలకు సంబంధించి ఆరోగ్య సమస్యలు ఎన్నో ఉంటాయి. వయసు ఆధారంగా ఇవి వస్తుంటాయి. చాలా మంది అనుమానాలు, అపోహలతో వాటిని నిర్లక్ష్యం చేస్తూ పరిస్థితిని తీవ్రం చేసుకుంటున్నారు. మహిళ క్లినిక్‌లకు వెళితే అక్కడ అంత మహిళ సిబ్బంది ఉండడం వలన ఎలాంటి సందేహాలు లేకుండా తమ ఇబ్బందులను వారి దృష్టికి తీసుకువెళ్లవచ్చు. పరీక్షలు చేయించుకుని సమస్యలను నిర్ధారణ చేసుకోవచ్చు. వారికి మెరుగైన వైద్యం సిఫారసు చేయవచ్చు. క్లినిక్‌లో అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయించుకోవచ్చు. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, థైరాయిడ్ పరీక్ష సూక్ష్మపోషక లోపాలను గుర్తిస్తారు. ఓరల్ సర్వికల్, రొమ్ము క్యాన్సర్ తెలుసుకునేందుకు స్క్రీనింగ్ నిర్వహిస్తారు. అయోడిన్, యాసిడ్, ఐరన్ లోపం, విటమిన్ బీ12 పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహిస్తున్నారు. మూత్రకోశ సంబందిత ఇన్‌ఫెక్షన్లు, పెల్విన్ ఇంట్రమెంటరీ వ్యాధుల పరీక్ష మనోపాత్ దశకు సంబంధిత పరీక్షలు హార్మోన్ డిస్టేట్‌మెంట్ థెరపీ ఉంటుందన్నారు. నెలసరి సమస్యలు, లైగింక అంటువ్యాధుల సమస్యలు, బరువు నియంత్రణ వంటి అంశాలను ఇక్కడ మహిళలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు. ఆరోగ్య కౌన్సిలింగ్ ప్రతీ మంగళవారం ఉంటుందన్నారు. అవసరమైన మందులను కూడా ఉచితంగానే అందజేస్తారు. ఇక్కడ వైద్య సదుపాయలు అందుబాటులో లేకుంటే ఆధునిక ఆసుపత్రులకు సిఫారసు చేస్తుంటారు.



బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

● ప్రచార లోపం అధిగమిస్తే..

మహిళలు ఆరోగ్య దృష్ట్యా ఇది మంచి కార్యక్రమం అయిన క్షేత్రస్థాయిలో కావాల్సినంత ప్రచారం రాకపోవడం లోటుగా మారుతుంది. ఆరోగ్య కేంద్రం చుట్టు పక్కల ఉన్న వారు ఆశ కార్యకర్తల ప్రోద్భలంతో వచ్చే వారు. ఇతరులకు దీనిపై పూర్తి అవగాహన ఏర్పడడం లేదు. ప్రజల్లో చైతన్యం పెరిగితే మరింత ఎక్కువ మంది మహిళలు ఈ సేవలను వినియోగించుకునే ఆస్కారం ఉంటుంది.

● మహిళలు సద్వినియోగం చేసుకోవాలి: డాక్టర్ సమత

మహిళల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మంచి కార్యక్రమం ఇది. కొందరు కొన్ని రకాల అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారు. నిజానికి ప్రధాన సమస్యలు ప్రాథమిక దశలోనే గుర్తిస్తేనే చికిత్స సులభంగా ఉంటుంది. తద్వారా దాని నివారణకు అపార శాంతం ఉంటుంది. బోధన్ డివిజన్ పరిధిలో ఎంపిక చేసిన పీహెచ్‌సీ, యూపీహెచ్‌లో అందుబాటులో ఉన్న సేవలను మహిళలు వినియోగించుకోవాలి.


రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

రామాలయ నిర్మాణానికి భూమిపూజ

భిక్కనూరు, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో హనుమాన్ ఆలయం వద్ద రామాలయ నిర్మాణానికి గ్రామస్థులు ఆదివారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంజనేయశర్మ, శ్రీనివాస్ పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థులు, దాతల సహకారంతో శ్రీ రాముల వారి ఆలయాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ సూర్యకాంత్‌రెడ్డి, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాలుర పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

లింగంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నుంచి ఈనెల 30 వరకు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శౌకత్‌అలీ తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. బోధకులుగా సాయిరాం, కోర్సు ఇన్‌చార్జీగా మహీద్ సిద్దీఖీ వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

సదాశివనగర్, మే 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆదర్శ కళాశాల సదాశివనగర్‌లో ఇంటర్మీడియేట్ ప్రవేశం పొందడానికి నోటిఫికేషన్ విడుదల అయినట్లు ప్రిన్సిపాల్ రాజారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్మీడియేట్ ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశం పొందేందుకు మే 5 నుంచి మే 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉండగా ప్రతి గ్రూపులో 40సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు పీపీటీ ప్రవేశ పరీక్ష

కామారెడ్డి టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్(పీపీటీ) ప్రవేశ పరీక్షను ఈనెల 5న నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆకుల బాబు, సాయిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీపీటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రగతి నగర్‌లో అత్యున్నత ప్రమాణాలతో అనాథ, పాక్షిక అనాథ, నిరుపేదల కుటుంబాల పిల్లలకు ఉచిత విద్యను రెసిడెన్షియల్ విధానంలో 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు గత కొన్ని దశాబ్దాలుగా పాఠశాల నడపబడుచున్నందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ ఈనెల 5న జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశపరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. మిగిలిన వివరాలకు 9866979686, 9441027843 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

రేపు తెరవే రాష్ట్ర కార్యవర్గ సమావేశం

కామారెడ్డి టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల వేదిక (తెరవే) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈనెల 6న కామారెడ్డిలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు గఫూర్ శిక్షక్, అల్లి మోహన్‌రాజ్‌లు తెలిపారు. కర్షక్ బీఈడీ కళాశాలలో ఉదయం 10.30 నుంచి సమావేశం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరవుతున్నందున పెద్ద సంఖ్యలో తెరవే సభ్యులు పాల్గొనాలని తెలిపారు.

బ్లూకోర్ట్ సిబ్బందికి ఎస్పీ అభినందన

బాన్సువాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని కాపాడిన బ్లూకోర్ట్ సిబ్బందికి జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర అభినందించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారు జామున 1.40 నిమిషాల ప్రాంతంలో గూడెంగల్లిలో ఓ వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడని డయల్ 100కు సమాచారం అందింది. దీంతో బ్లూకోల్ట్ డ్యూటీలో ఉన్న సిబ్బంది కానిస్టేబుల్ భరత్, హోంగార్డు సతీష్ హుటాహుటిన ఘటన స్థలానికి వెళ్లి ఇంట్లో లుంగీతో ఫ్యాన్‌కు ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధపడుతున్న వ్యక్తిని రక్షించి కిందకు దించారు. అంతేగాక ఆత్మహత్య చేసుకోవద్దని బాధితునికి ధైర్యం చెప్పి ఆ వ్యక్తిని రక్షించారు. దీంతో విషయం తెలుసుకున్న ఎస్పీ బ్లూకోర్ట్ సిబ్బందిని అభినందించారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి పోలీస్ శాఖ పేరు తీసుకరాడం ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంచిందని ఎస్పీ తెలిపారు.


తూకం వేసి లోడింగ్‌కు సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు

జోరుగా సాగుతున్న ధాన్యం కొనుగోళ్లు

పెద్ద కొడప్‌గల్, మే 4 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ సహకార సంఘం పరిధిలో రబీ సీజన్ కింద ఆయా గ్రామాల్లో రైతన్నలు వరి పంటను సాగు చేశారు. రైతన్నలు సాగు చేసిన వరి పంటను కొనుగోలు చేసేందుకు పెద్ద కొడప్‌గల్ సహకార సంఘం ఆధ్వర్యంలో అధికారులు పెద్ద కొడప్‌గల్, శాంతాపూర్, కాస్లాబాద్, పోచారం, సీతారాం పల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి 2320 రూపాయలు, బీ గ్రేడ్ రకానికి 2300 రూపాయలు ప్రకటించడంతో రైతన్నలు ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తీసుకవస్తున్నారు. ప్రభుత్వం నుంచి మద్దతు ధర ఉండటం తూకం పూర్తయిన వెంటనే ధాన్యం డబ్బులు ఖాతాల్లో పడుతుండటంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద కొడప్‌గల్ సహకార సంఘం పరిధిలో గల కొనుగోలు కేంద్రాల నుంచి ఇప్పటి వరకు 30 వేలకు పైగా ధాన్యం బస్తాలను కొనుగోలు చేశారు. ప్రారంభంలో కొనుగోలు కేంద్రాలల్లో పంటను అమ్మిన రైతుల ఖాతాలల్లో డబ్బులు సైతం జమ అయినట్లు రైతన్నలు తెలిపారు.

60 వేలకు పైగా జొన్న బస్తాల సేకరణ

పెద్ద కొడప్‌గల్ సహకార సంఘం ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటికే 60 వేలకు పైగా జొన్న బస్తాలను కొనుగోలు చేసినట్లు సహకార సంఘ సీఈవో సందీప్ తెలిపారు. రైతన్నలకు ఇబ్బంది తలెత్తకూడదనే ఉద్దేశ్యంతో కొనుగోళ్లను వేగవంతం చేశామని తెలిపారు.

జిల్లాలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భిక్కనూరు, మే 4(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ ఉన్నత పాఠశాలలో 2004-2005 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 20 సంవత్సరాల అనంతరం విద్యార్థులు ఒకచోట చేరి ఒకరినొకరు క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన అప్పటి ఉపాధ్యాయులు బాలకిషన్, సతీష్, నరేందర్, రవికుమార్‌ను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కష్టపడి చదివిన వారు, ఓర్పు సహనం ఉన్నవారు తప్పకుండా విజయం సాధిస్తారని అన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి, ముున్ముందు బ్యాచ్ ఆధ్వర్యంలో సేవా, అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు స్నేహితులు తీర్మానం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

సదాశివనగర్: సదాశివనగర్ ఉన్నత పాఠశాలకు చెందిన 2000-01 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. సదాశివనగర్ సమీపంలో ఉన్న లక్ష్య ఫంక్షన్‌హాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 25 సంవత్సరాల అనం తరం కలిసిన పూర్వ విద్యార్థులు వారు స్థిరపడిన వివరాలు, ఆర్థిక పరిస్థితులు, చేస్తున్న ఉద్యోగ వివరాలు, కుటుంబ వివరాలు, పిల్లల చదువులను ఒకరినొకరు పాలుపంచుకుని వారియొక్క ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకుని పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం గురువులను సన్మానం చేసి విందు ఆరగించారు.


సదాశివనగర్‌లో..

లింగంపేట: లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1998-99లో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. వారికి విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా ప్రత్యేక వాహనంలో పూల వాన కురిపిస్తూ ర్యాలీ తీశారు. గురువులను ఘనంగా సాన్మానించారు. నాడు వారు చేసిన అల్లరి పనులు, నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందగా గడిపారు. వారు చేస్తున్న ఉద్యో గాలు, వృత్తులు, కష్ట, సుఖాలను ఒకరికి ఒకరు పంచుకున్నారు. వారి తోటి విద్యార్థులు నలుగురు అకాల మరణం చెందడంతో వారి కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 5వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. వారు చదువుకున్న పాఠశాలకు బ్లూటూత్ స్పీకర్ బాక్సులను విరాళంగా అందజేశారు. ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో మండల టార్‌కు రూ.3వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ప్రభు లింగం, బుచ్చిరెడ్డి, గంగాధర్, రామాగౌడ్, లక్ష్మణ్‌రావు, రవిలతో పాటు నాటి విద్యార్థులు శ్రీకాంత్, సాయిలు, మహేష్‌లతో పాటు విద్యార్థులు ఉన్నారు.


బస్వాపూర్ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు


లింగంపేటలో..

వడగండ్ల వానతో తడిసిన ధాన్యం


భవానిపేటలో వడగండ్ల వానకు తడిసిన ధాన్యం కుప్పలు


చికిత్స పొందుతున్న పిడుగుపాటుకు గురైన వ్యక్తి

లింగంపేట, మే 4 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని భవానిపేటలో ఆదివారం ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన భారి వర్షం కురిసింది. దీంతో రైతులు ఆగమయ్యారు. కొనుగోలు కేంద్రాలలో తూకానికి సిద్దంగా ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. ఆకాల వర్షం రైతును ఆగం చేస్తుంది. రోజంత భగభగ మండే ఎండ, సాయంత్రం ఈదురు గాలులతో ఉరుములు మెరుపులతో భయంకరమైన వడగండ్ల వానతో రైతులు, సామాన్య జనంతో పాటు పశు, పక్షులు తట్టుకోలేకపోతున్నాయి. వడగండ్ల వానకు పక్షులు సైతం విల విలలాడాయని గ్రామస్తులు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం వేసి రైస్ మిల్లులకు పంపాలని రైతులు కోరుతున్నారు.

భిక్కనూరు : భిక్కనూరు మండలంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం ఆదివారం రైతులను తీవ్ర భయబ్రాంతులకు గురిచేసింది. మొదటగా ఉన్నట్టుండి పెద్దఎత్తున ఈదురుగాలులు రాగా మండలంలోని మామిడి తోటలు, గ్రామాల్లోని చెట్ల నుండి మామిడికాయలు నేలరాలాయి. అనంతరం ఉరుములు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం దాదాపు అరగంటపాటు పడటంతో రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసిముద్దైంది. కోతకు వచ్చిన పంట కొన్నిప్రదేశాలలో నేలకొరగగా, మరికొన్నిచోట్ల ధాన్యం నేలరాలింది. కాగా మరికొన్నిగ్రామాల్లో అక్కడక్కడ రాళ్ల వర్షం కురవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు.

దోమకొండ : దోమకొండ మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం సుమారు గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అరబోసిన ధాన్యం, రాశులు చేసిన కుప్పలు తడిసిపోయాయి. రాశులపైన టార్పాలిన్‌లను కప్పేందుకు రైతులు వర్షంలో నానా అవస్థలు పడ్డారు. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులతో వడగండ్ల వర్షం కురియడంతో అన్నదాతలకు ఆకాల నష్టం వాటిల్లింది.

తాడ్వాయి : మండలంలో కురిసిన అకాలవర్షానికి కృష్ణాజీవాడి గ్రామానికి చెందిన బద్దం రాజిరెడ్డికి చెందిన ధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి. అసలే సరైన గిట్టుబాటు ధర లేక రైతన్నలు బాధపడుతుంటే అకాలవర్షానికి తడిసిన ధాన్యాన్ని ఎవరు కొంటారని రైతులు ఆందోళన చెందుతున్నారు.తక్షణమే ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనాలని కోరుతున్నారు.

బీబీపేట : బీబీపేట మండలంలో ఆదివారం కురిసిన అకాలవర్షానికి రైతుల పంట నీటిపాలైంది. అన్ని గ్రామాలలో వడగండ్ల వర్షం కారణంగా కేంద్రాలలో ఆరాబెట్టిన ధాన్యం తడిసిముద్దవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మరికొన్నిచోట్ల ధాన్యం కుప్పలలోకి వరదనీరువచ్చిచేరింది. ఇదిలా ఉండగా తుజాల్‌పూర్ గ్రామంలో పిడుగుపాటుతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలోని గోపకవిత, వివేక్,హేమలత, రంజిత్,కలకుంట్ల రాజులు వర్షం పడడంతో చెట్టుకిందకు వెళ్లారు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగుపడడంతో నలుగురు అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. దీంతో గ్రామస్తులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

స్టేట్ టాపర్‌ను అభినందించిన ఎస్పీ


అనిశ్చితను అభినందిస్తున్న ఎస్పీ

కామారెడ్డిటౌన్,మే 4(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి స్టేట్‌టాపర్‌గా నిలిచిన నిమ్మ అన్వితను ఎస్పీ రాజేష్‌చంద్ర అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి ఎంతోమందికి ఉద్యోగాలు కల్పించే విధంగా ఉండాలని సూచించారు. ఎస్పీఆర్ పాఠశాల యాజమాన్యంను సైతం అభినందించారు. కార్యక్ర మంలో ఎస్పీఆర్ స్కూల్ యాజమాన్యం సభ్యులు మారుతి, ఉపాధ్యా యులు,సిబ్బంది పాల్గొన్నారు.

'రేవంత్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శం'


దోమకొండలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దోమకొండ, మే 4(ఆంధ్రజ్యోతి):తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలన దేశానికే ఆదర్శమని దోమకొండ మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. రేవంత్‌రెడ్డి పరిపాలనను కేంద్ర ప్రభుత్వం సైతం ఆదర్శంగా తీసుకుంటుందని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేపట్టనున్న కుల గణన తొందరలో పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో కుల గణన పూర్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు తీగల తిర్మల్‌గౌడ్, నల్లపు శ్రీనివాస్, సీతారాం మధు, షమ్మీ, మల్లేష్ యాదవ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం'


సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న దృశ్యం

పెద్దకొడప్‌గల్, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసమే పనిచే స్తుందని మండల కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కాటేపల్లి గ్రామంలో సీఎంఆర్ఎఫ్ పథకం కింద మంజూరైన చెక్కులను లబ్దిదారులకు అందించారు. కార్యక్రమంలో చిన్న కొడప్‌గల్ సహకార సంఘ వైస్ చైర్మన్ గంగాగౌడ్, నాయకులు పాండు నాయక్, బార్యానాయక్, రాంచందర్, శ్రీనివాస్, రసూల్, చాంద్‌పాష బాల్‌రాజ్, దేవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో పశువుల పాక దగ్ధం

బీర్కూర్, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చర్చి సమీపంలో ఆదివారం పశువుల పాక దగ్ధమైంది. బీర్కూర్ మండల కేంద్రంలో పీరయ్య అనే రైతుకు ఇంటి సమీపంలో పశువుల పాక ఉంది. అయితే ఆదివారం మధ్యాహ్నం పశువుల పాకకు నిప్పు అంటుకుంది. స్థానికులు గమనించి పాకలో ఉన్న గేదెలను, దూడలను విడిచేసి రక్షించారు. నీళ్ళు చల్లి మంటలను ఆర్పడానికి ప్రయత్నించారు. అయినా పశువుల పాక పూర్తిగా దగ్ధమైంది. అగ్ని మాపక సిబ్బందికి పలుమార్లు ఫోన్ చేసి సమాచారం అందించినా ఘటనా స్థలానికి రాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఘటనలో ఒక దూడకు స్వల్ప గాయాలయ్యాయి. 20 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

నేటి నుంచి కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

నిజాంసాగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆదర్శ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యాబోధన కోసం దరఖాస్తులను ఆహ్వానించారు. ఈనెల ఐదో తేదీ నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు. ఆదర్శ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాలలో అధికార యంత్రాంగం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రతి గ్రూపులో 40 సీట్ల చొప్పున భర్తీ చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వ తేది చివరి తేదీ అని పేర్కొన్నారు.

పార్టీ శ్రేణులను వేధిస్తున్న వారికి తగిన గుణపాఠం చెబుతాం

● బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శశాంక్

భిక్కనూరు, మే 4(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ శ్రేణులను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలే ప్రసక్తే లేదని తగిన గుణపాఠం చేప్తామని రానున్న రోజులు బీఆర్ఎస్‌వేనని వారికి అసలు మిత్తి కలిపి చెలిస్తామని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు శశాంక్ అన్నారు. ఆదివారం భిక్కనూరు మండలకేంద్రంలో బీఆర్ఎస్ యువజన విభాగం ముఖ్య కారక్యకర్తల మండలస్థాయి సమావేశాన్ని మండల అధ్యక్షుడు రంజిత్ వర్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిగ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరే కత తీవ్రంగా ఉందని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హమీలను నేరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కామారెడ్డిలో రూ.150కోట్ల స్వంత నిధులతో కామారెడ్డిని మోడ్రన్‌గా అభివృద్ధి చేస్తానని హమీ ఇచ్చిన కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి ఏ ఒక్క అభివృద్ధి పని చేసిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాణహిత-చేవెళ్ల పనులకు నిధులు మంజూరుపై హర్షం


షబ్బీర్‌అలీని సన్మానిస్తున్న దృశ్యం

భిక్కనూరు, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రాణహిత - చేవెళ్ల 22వ ప్యాకేజీ పనులకు రూ.23కోట్లు మంజూరు కావడం పట్ల ఆదివారం భిక్కనూరు మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్న గత పది సంవత్సరాల కాలంలో 22 ప్యాకేజీకి కనీసం రూ.10కోట్లు కూడా మంజూరు చేయలేదని అన్నారు. ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ కామారెడ్డి అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. త్వరలోనే ప్రాణహిత-చేవెళ్ల పథకాన్ని పూర్తిస్థాయిలో పూర్తిచేసి కామారెడ్డి ప్రజల కాళ్లు కడుగుతామన్నారు. ఈ మేరకు నిధులు మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీని తన నివాసంలో శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేసి సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింబాద్రి, భూమయ్య, దయాకర్‌రెడ్డి, సుదర్శన్, మోహన్‌రెడ్డి, రాంచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు తప్పవు


రహదారి నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

పెద్ద కొడప్‌గల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో గల మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలిస్తే చర్యలు తీసుకుంటామని పెద్ద కొడప్‌గల్ ఎస్ఐ మహేందర్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని అంజనీ గేట్ వద్ద 161వ జాతీయ రహదారిపై ప్రయాణికులు రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్గించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మైనర్ పిల్లలు వాహనాలు నడుపుట నేరమని, ఈ విషయం తెలియని కొంతమంది గ్రామాల్లో తమ పిల్లలకు వాహనాలిస్తున్నారని, దీంతో కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు తెలుసుకుని మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని స్పష్టం చేశారు. ఇక వాహనాదారులు కూడా తాము వాహనాలు నడిపే సమయంలో వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవడంతో పాటు, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని పేర్కొన్నారు. అంతేగాక 161వ జాతీయ రహదారిపై వాహనదారులు రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వెంకటేష్, శ్రీనివాస్, అంజయ్య తదిత రులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - తుడరాం
ప్రియా 70 - రెట్రో
ప్రియా 35 - రైడ్-2

బాన్సువాడ

మహేశ్వరి - అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
వెంకటేశ్వర - సోదర

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

